వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 20 అక్టోబర్ 2023

## కరెంటు షాక్‌తో అన్న, రోడ్డు ప్రమాదంలో తమ్ముడు మృతి

**మైదుకూరు అక్టోబర్ 19, ప్రభాతవార్త**



మైదుకూరు మండలం గంజి కుంట గ్రామ పంచాయతీ గంజికుంట గ్రామంలో గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మిరప పంటకు నీరు పెట్టడం కోసం తండ్రితో కలిసి పొలం దగ్గరకు వెళ్లిన పాములేటి రాజా కుమారుడు నరేంద్ర కుమార్ (29) స్టాటర్ ఆన్ చేస్తుండగా కరెంటు షాక్ కొట్టి స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే వైద్యం కోసం ప్రొద్దుటూరు హాస్పిటల్ తీసుకెళ్ళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు, పాములేటి రాజాకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె, కుమార్తెకు వివాహం ఐనది, నరేంద్ర మృతి చెందిన విషయం తెలిసి హైదరాబాద్‌లో ఉన్న తమ్ముడు రాజేష్ హైదరాబాద్ నుండి స్కూటర్ లో బయలు దేరి గంజి కుంట వస్తుండగా శంషాబాద్ దగ్గర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు, ఒకే కుటుంబంలో అన్నదమ్ములు మృతి చెందడంతో బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. అన్నదమ్ముల మరణ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి.

## నాల్గవ రోజున లలితాదేవి అలంకారములో అమ్మవారు

బద్వేలు ప్రభాతార్త

అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామి దేవాలయంలో దసరా సందర్భంగా అమ్మవారు లలితాదేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. నాల్గవ రోజు గురువారం పూజా కార్యక్రమానికి ఉభయ దాతలుగా వెంకటరమణ రఘురామిరెడ్డి, శివానందరెడ్డి, శ్రీరామరావు పాల్గొన్నారు.



### రంగసముద్రంలోని

## సర్వే నెంబరు 1207లో ఏమి జరుగుతోంది?

- 42 ఎకరాలలో12 ఎకరాలకు మాత్రమే పట్టాలు
- మిగిలిన 30 ఎకరాలపై కన్నేసిన కబ్జాదారులు
- రెవెన్యూ సిబ్బంది సహకారంతో కబ్జాకు యత్నాలు
- చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



**బద్వేలు/ పోరుమామిళ్ళ, అక్టోబర్ 19 ప్రభాతవార్త**

పోరుమామిళ్ల మండలంలో భూ కబ్జాలకు అడ్డేలేకుండా పోతోంది. ప్రధానంగా పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ లో అనేక ఆక్రమణలు వెలుగు చూస్తున్నాయి. సర్వే నెంబరు.1207లో 42 ఎకరాలు ప్రభుత్వ భూమిని 12 ఎకరాలు పలువురికి పంపిణీ చేయడం జరిగింది. ఆన్‌లైన్‌లో కూడా ఈ సర్వే నెంబరులోని 12 ఎకరాలు మాత్రమే ఉన్నప్పటికీ మిగిలిన 30 ఎకరాలకు మాత్రం ఎలాంటి ఆధారాలు లేవు. అయినప్పటికీ రెవెన్యూ సిబ్బంది చేతివాటంతో 30 ఎకరాల ఆక్రమణకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. వీరి వెనుక ఎవరున్నారనే విషయం పక్కనపెడితే రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది తన చేతివాటాన్ని ఉపయోగించి 30 ఎకరాలకు పత్రాలు ఇచ్చినట్లు సమాచారం. దీని ఆధారంగా భూ కబ్జాదారులు 30 ఎకరాలు చదును చేసే ప్రయత్నాలలో ఉండడంతో ఇదే క్రమంలో మరికొంతమంది అక్కడ భూమి చదునును అడ్డుకోవడం జరుగుతుంది. ఒకరిపై ఒకరు మాటలతో భూమిని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చూస్తుండడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే వెంటనే చర్యలు తీసుకునే అధికారులు ఇంతవరకు ఆ భూమిపై ఎందుకు దృష్టిపెట్టలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో అధికారుల పని ఒత్తిడి కావడంతో ఈ భూమిపై నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు వినవస్తున్నాయి. మరికొంత మంది రెవెన్యూ అధికారుల సహకారంతో కబ్జాకు యత్నిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజులలో ఒక సెంటు ప్రభుత్వ భూమి కూడా కనపడే పరిస్థితిలేదు. ఇప్పటికే పోరుమామిళ్లలోని రంగసముద్రం పంచాయతీలో జరుగుతున్న అనేక ఆక్రమణలను అధికారులు చూసి చూడనట్లు ఉండడంతో పలు అనుమానాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఇది ఉదాహరణగా నిలుస్తోంది. గతంలో అసైన్‌మెంటులో ఇచ్చిన భూములు నేటివరకు లబ్దిదారులకు అందకపోగా ఈ మధ్యకాలంలో అదే భూములు వేరేవారికి ఆన్‌లైన్‌లోకి ఎక్కడంతో గొడవలు మొదలయ్యాయి. గతంలో ఇచ్చిన భూములు రద్దు కాకుండానే వేరే వ్యక్తుల పేరుతో ఆన్‌లైన్‌లో ఎలా ఎక్కుతాయని ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే అనేక గొడవలు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సర్వేనెంబరు 1207లో జరుగుతున్న వ్యవహారంపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజలకు సంతృప్త స్థాయిలో అందుతున్న సంక్షేమ ఫలాలు

### గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాష

**కడప అక్టోబర్ 19, ప్రభాతవార్త**



ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందుతున్నాయని, ఇది ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పారదర్శక పాలనకు అద్దం పడుతోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ అన్నారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా...29వ డివిజన్ కార్పొరేటర్ షైక్.యం.డి. రిజ్వాన్,ఇంచార్జ్ షేక్ .జిలాన్ ఆధ్వర్యంలో సెవెన్ రోడ్స్ సచివాలయం-1 పరిధిలోని స్థానిక మాచుపల్లి బస్ స్టాండ్, హెచ్ డి ఎఫ్ సి దగ్గర నుండి ప్రారంభించి పలు వీధులు, ప్రాంతాలను సందర్శించారు. 136 వరోజైన గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా కు 29 డివిజన్ పరిధిలోని కాలనీవాసులు, అభిమానులు, నగర ప్రజానీకం, మహిళలు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని ఉపముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు... స్థానిక కార్పొ రేటర్, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వార్డు లోని అన్ని ఇళ్లకు తిరుగుతూ కుటుంబాలను కలుసుకోవడంతో పాటు, వారు పొందుతున్న లబ్ది సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రతి కుటుంబం లబ్ది చేకూరిందని ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయగా.. పలువురు తమ సమస్యలను అంజాద్ బాషా దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నా రన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితోపాటు కార్పొరేటర్ 29 డివిజన్ షైక్. యం.డి. రిజ్వాన్, ఇంచార్జ్ షేక్. జిలాన్, సీనియర్ నాయకుకులు అఫ్జల్ ఖాన్, నగర అధ్యక్షులు నారపు రెడ్డి సుబ్బారెడ్డి, ఈస్ట్ జోన్ అధ్యక్షులు తోట కృష్ణ, నాయకులు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, పసుపులేటి మనోజ్ కుమార్, అరీఫుల్లా, బిహెచ్ రహీం, మహిళా నాయకురాల్లు టి. వెంకట సుబ్బమ్మ, పత్తి రాజేశ్వరి, రత్న కుమారి, పసుపులేటి విజయకుమారీ, సచివా లయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ

**వేంపల్లె, అక్టోబరు 19, ప్రభాతవార్త**

వేంపల్లెలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కడప కళాశాలల విద్య ఆర్జేడీ డి.నాగలింగారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన విద్యార్థిని, విద్యార్థుల వివరాలు, కళాశాల సిబ్బంది హాజరు పట్టికను, అధ్యాపకులకు సంబంధించి టీఎల్‌పి, నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవన స్థితిగతులను, కళాశాలలో మొదటి సారిగా నూతనంగా ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్టుల వివరాలు, మొదలగు అంశాలపైన వివరాలు అడిగి రికార్డులు పరిశీలించారు. కళాశాల సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.యోగాంజనేయులు, సిబ్బంది మహేష్‌రావు, గంగాధర్, సుబ్బారెడ్డి, రమేష్, పీడీ తేజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ బిల్వవృక్ష వాసవిదేవి జగన్మోహినిఅలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

### - ఆకట్టుకున్న తోటోత్సవం





**బద్వేలు అర్బన్, అక్టోబర్ 19 ప్రభాతవార్త**

దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం బద్వేలు పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.వి. సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, రాచపూడి సాయిక్రిష్ణ సెక్రటరీ కొలిశెట్టి నాగరాజ, ట్రెజరర్ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలు సగళా సురేష్ బాబు, వైభవ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మునగా చలమయ్య, దర్శి వెంకటే శ్వర్లుతో పాటు ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే అమ్మవారికి వివిధ రకాల విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. రాత్రి శ్రీ బిల్వవృక్ష వాసవిదేవి జగన్మోహిని అలంకారంలో వాసవిమాత అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా, ఇక్కడ ఏర్పాటు చేసిన తోటోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తోటోత్స వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రకాల ఆకులు, పండ్లు, దేవుని ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఈ తొటొత్సవాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. ప్రత్యేక ఉభయదాతలుగా వల్లంకొండు వెంకటరమణ, ధర్మపత్ని ధనలక్ష్మి వీరి కుమారులు వెంకట రాఘవేంద్ర, వెంకట అనీత్, పబ్బతి చంద్రశేఖర్ ధర్మపత్ని వసంత లక్ష్మి కుమారుడు వెంకటసాయి సుమంత్, కుమార్తె సాయి సుదీప్తి కుటుంబ సభ్యులను ఆలయ కమిటి సభ్యులు బ్యాండు మేళాలతో అమ్మవారిశాలకు ఆహ్వానం పలుకుతూ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.తోటోత్సవంలోఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఆర్యవైశ్య వర్తక సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, సెక్రటరీ గంగిశెట్టి ధనలక్ష్మి, జిల్లా జనరల్ సెక్రటరీ దేవతి లలిత, పబ్బతి శ్రీదేవి, దొంతంశెట్టి శ్రీదేవి భక్తులు క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పలువురు కమిటి సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

### వృత్తి వ్యాపారుల

## ఆర్థిక వృద్ధే జగనన్న చేదోడు లక్ష్యం

### జెసి, ఇన్‌ఛార్జి కలెక్టర్ గణేష్‌కుమార్



**కడప అక్టోబర్ 19, ప్రభాతవార్త**

షాపులున్న రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ వృత్తి వ్యాపారుల ఆర్థిక అభివృద్దే.. లక్ష్యంగా.. రాష్ట్ర ప్రభుత్వం "జగనన్న చేదోడు" పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా జేసీ, ఇంఛార్జ్ కలెక్టర్ జి. గణేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరు బహిరంగ సభ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4వ విడత "జగనన్న చేదోడు" లబ్ది మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి.. రూ.10 వేల మొత్తాన్ని నేరుగా లబ్దిదారుల ఖాతాలో జమచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ స్పందన హాలు నుండి జిల్లా జేసీ, ఇంఛార్జ్ కలెక్టర్ జి. గణేష్ కుమార్, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డా.వి.బ్రహ్మయ్యలతోపాటు.. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజమ్, రాష్ట్ర పూసర్ల, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ కుమారి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ టి.పి.వెంకట సుబ్బమ్మ, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, ఎపిటిడిసి డైరెక్టర్ ఎల్. జయన్నలు తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం స్థానిక విసి హాలులో.. "జగనన్న చేదోడు" పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా.. షాపులున్న 16,158 మంది నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్ల కుటుంబాలకు 4వ విడతగా మంజూరయిన రూ.16,15,80,000 ల మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి.. జిల్లా జేసీ, ఇంఛార్జ్ కలెక్టర్ జి. గణేష్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడి లు లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా.. జిల్లా జేసీ, ఇంఛార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... అర్హత ఉన్న ప్రతి చివరి వ్యక్తికి కూడా "జగనన్న చేదోడు" పథకం ద్వారా లబ్ది చేకూరాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు. షాపులుండి చిన్నపాటి, వృత్తిపరమైన వ్యాపారాలు చేసుకునే బలహీన వర్గాలైన నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్ల కుటుంబాలు.. కోవిడ్ లాక్ డౌన్ సమయంలో ఆర్థికంగా నలిగిపోయిన పరిస్థితులు గమనించమన్నారు. అలాంటి సమయంలో ప్రభుత్వం అమలు చేసిన "జగనన్న చేదోడు" పథకం ద్వారా అందజేసిన రూ.10 వేల మొదటి, రెండవ విడత సాయం కోవిడ్ విపత్కర సమయంలో వారికి ఎంతో ఉపకరించిందన్నారు. ఆ పరిస్థితులను అధిగమించి.. ప్రస్తుతం నాలుగవ విడత సాయాన్ని కూడా ప్రభుత్వం అందించడం సంతోషించదగ్గ విషయం అన్నారు.

జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డా.వి. బ్రహ్మయ్య మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి "జగనన్న చేదోడు" పథకం మూడవ విడత సాయం ద్వారా.. జిల్లాలో షాపులు ఉన్న 16,158 మంది టైలర్లు, రజకులు, నాయి బ్రాహ్మణుల కుటుంబాలు లబ్ది పొందాయన్నారు. వీరందరికీ కలిపి మొత్తం రూ.16.15 కోట్ల సాయం అందిందన్నారు. ఇందుకోసం వాలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించి.. రాజకీయాలు, పార్టీలకతీతంగా అర్హులైన నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లను లబ్దిదారులుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఏవైనా ఇబ్బందులు కారణంగా ప్రస్తుతం లబ్ది పొందలేని వారు ఉంటే.. సచివాలయ వాలంటీర్ల ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని, సంబంధిత వివరాల కోసం జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి మనోజ్‌కుమార్, బిసి సెల్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ బీసీ కుల సంఘాల అధ్యక్షులు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, బీసీ కార్పొరేషన్, బిసి సంక్షేమ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో పాటు.. లబ్దిదారులయిన నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లు పాల్గొన్నారు.

### చంద్రబాబు అక్రమ అరెస్టుపై తిరగబడి

## వైకాపా ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం

### - మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

**పులివెందుల, అక్టోబరు 19, ప్రభాతవార్త**



వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తెదేపా అధినేత చంద్రబాబునాయుడుపై రాజకీయ కక్ష సాధింపులో భాగంగా అక్రమంగా అరెస్టు చేశారని, ఈ అక్రమ అరెస్టుపై ప్రజలందరు తిరగబడి.. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ముందుకు రావాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. కడప పార్లమెంట్, పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలోని గురిజాల గ్రామ పంఆయతీలో గురువారం బాబుతో నేను.. ప్రజా వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మారెడ్డి రవీంద్రనాథరెడ్డి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టుపై క్షుణ్ణంగా వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజానీకంతో మాట్లాడుతూ సంఘీభావంగా ముందుకు కదిలి రావాలని గ్రామస్థులను కోరారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మారెడ్డి రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ఈరోజు ఎవరినోట విన్నా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేశారన్న విషయాన్ని పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారన్నారు. ప్రజలే ఇది అక్రమ అరెస్టు అని బాహాటంగా చెబుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. సొంత వైఎస్ఆర్‌సీపీ నాయకులే చంద్రబాబుది అక్రమ అరెస్టు అని చెబుతున్నారన్నారు. ఈరోజు ఏ గ్రామంలో చూసినా టీడీపీకి ఓటు వేస్తాం.. చంద్రబాబునాయుడును సీఎం చేస్తామంటూ ప్రజలే స్వచ్ఛందంగా చెబుతున్నారంటే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని స్పష్టంగా తెలుస్తోందన్నారు. మనందరం ఏకమై చంద్రబాబునాయుడును సీఎంగా గెలిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుదాం అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రకాష్‌రెడ్డి, బూత్ ఇన్‌ఛార్జి ఓబుళరెడ్డి, టీసీ సెల్ విభాగ ఉపాధ్యక్షుడు మురళి యాదవ్, రాష్ట్ర తెలుగు కార్యనిర్వాహక కార్యదర్శి అజ్జుగుట్టు రవితేజ, బూత్ ఇన్‌ఛార్జి, టీడీపీ ఇన్‌ఛార్జి చిలకల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు కార్యక్రమంలో ఎంపి

**పుల్లంపేట, అక్టోబరు 19 ప్రభాతవార్త**

పుల్లంపేట మండలంలోని అనంతయ్యగారిపల్లె, తిప్పాయపల్లె గ్రామ పంచాయతిల్లో గడప గడపకు కార్యక్రమాన్ని ఎంపి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ప్రతి ఇంటికి ఎమ్మెల్యే కొరముట్ల, ఎంపి మిథున్‌రెడ్డి, ఎంపిపి బాబుల్‌రెడ్డిలు కలిసి వెళ్లి మాట్లాడం ఈ గడప గడపకు కార్యక్రమంలో ప్రత్యేకత సంతరించుకుంది. ఓపిగ్గా వారి సమస్యలను వింటూ వారికి కావాల్సిన సమస్య పరిష్కారానికి వెంటనే అధికారులతో మాట్లాడటం జరిగింది. కొన్ని సమస్యలకు అధికారులకు ఆయన సలహాలు, సూచనలు కూడా అందించడం ప్రత్యేకత సంతరించుకుంది. కార్యక్రమంలో అనంతయ్యగారిపల్లె, తిప్పాయపల్లె, వైఎస్ఆర్‌సిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి, వత్తలూరు గ్రామ పంచాయతి ఉపసర్పంచ్ మూరి శంకర్‌రెడ్డి, బికె మణి, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, సారథి, మండల తహశిల్దారు నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘు, ఇంకా మండల స్థాయి అధికారులు, పలువురు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గోపవరం ఎంపిడిఓ సస్పెండ్

**గోపవరం,అక్టోబర్ 19 ప్రభాతవార్త;**

మండల ఎంపిడిఓ చంద్రమౌళీశ్వర్‌రావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి,ఉన్నతాది కారుల ఆదేశాలను పాటించే విషయంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా విధుల నిర్వహణలో పలు రకాలైన అవక తవకలు ఉన్న కారణంగా ఆయనను సస్పెండ్ చేస్తూ ఎంపిడిఓ కార్యలయానికి ఉన్నతాధి కారులనుంచి ఆదేశాలు వచ్చాయి.



**ప్రొద్దుటూరు అక్టోబర్ 19, ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు శ్రీ రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవి వనవిహారిని దేవి అలంకారం



**రాజంపేట అక్టోబర్ 19, ప్రభాతవార్త**
రాజంపేటలో కొలువు తీరిన దుర్గాదేవి

## వైసిపి నాయకులు శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పించకపోవడం సిగ్గుచేటు

**పులివెందుల రూరల్, అక్టోబరు 19, ప్రభాతవార్త :**



శ్రీకృష్ణదేవరాయ వర్ధంతి సందర్భంగా పులివెందులలో ఆయన విగ్రహానికి నివాళులర్పించే తీరిక వైఎస్ఆర్‌సీపీ నాయకులకు లేదా అని టీడీపీ సీనియర్ నాయకులు బొల్లు విజయ భాస్కర్, బొల్లు శ్రీనివాస్, తుపాకుల ప్రసాద్, సంబ టూరు నరసింహులు ప్రశ్నించారు. గురువారం పులివెందులలో వారు విలేకర్లతో మాట్లాడారు. కృష్ణదేవరాయలకు నివాళులర్పించక పోవడంపై వైఎస్ఆర్‌సీపీ వారిని టీడీపీ నాయకులే కాదు.. ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారన్నారు. దేశభాషలందు తెలుగులెస్స అని తెలుగుకు ఎంతో ఖ్యాతి తెచ్చిన ఘనత శ్రీకృష్ణ దేవరాయలదే అన్నారు. పులివెందులలో శ్రీరంగనాథస్వామి ఆలయ నిర్మాణానికి, ఇతర ఆలయాల నిర్మాణాలకు ఆయన ఎంతో సహకరించారన్నారు. ఆ మహా చక్రవర్తికి జగమంతా నా కుటుంబం అనే వైఎస్ కుటుంబం నుండి వైఎస్ అభిషేక్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ మనోహ‌ర్‌రెడ్డి, వైఎస్ కుటుంబం నుండి ఏ ఒక్కరే కానీ ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించక పోవడం ఏమిటని తెదేపా నాయకులు ప్రశ్నించారు. వైఎస్ కుటుంబ సభ్యులు బలిజలను ఏ స్థాయిలో చూస్తున్నారో అర్థం అవుతోందన్నారు. అన్ని సక్రమంగా ఉన్నటువంటి తుమ్మలపల్లె సిఇబండి వెళ్లేటప్పుడు ఆ పార్టీ నాయకుడే ఈ మధ్య ప్రమాదవశాత్తు చనిపోవడం జరిగిందని, అలాంటిది పులివెందులలో పాతమార్గం మూసేసి ర్యాంపు ఏర్పాటు చేస్తామనడం సిగ్గుచేటన్నారు. అలా ర్యాంపు ఏర్పాటు చేస్తే ఎద్దుల ఎలా ఎక్కుతాయని, ర్యాంపు ఎక్కే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. 20శాతం ఓటు బ్యాంకు ఉన్న బలిజలకు ఇంత చిన్నచూపు చూస్తున్న వైకాపా నాయకులు వచ్చే ఎన్నికల్లో తగు బుద్ధి ప్రజలే చెబుతారన్నారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు అర్థం చేసుకుని సిరిబండి వెళ్లే పాత దారిని అలాగే ఉంచాలని ప్రజలు కోరుతున్నారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇరువురు అరెస్ట్

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 19, ప్రభాతవార్త**

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సిబ్బందితో జమ్మలమడుగు రోడ్డులోని కాకిరే నిపల్లె క్రాస్ వద్ద, దువ్వూరు రోడ్డులోని అమృత నగర్ వద్ద పెన్నానదిలో అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామానికి చెందిన చెల్లుబోయిన రవి ప్రొద్దుటూరు మండలం చెన్నంరాజుపల్లె గ్రామానికి చెందిన పేరం కాశీని అదుపులోకి తీసుకున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చంద్రబాబు అరెస్టు అక్రమం..



**కడప వైద్యవిభాగం, అక్టోబరు 19, ప్రభాతవార్త:**

తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ గురువారం తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు సైకిల్ యాత్ర 5వ రోజు ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు మీదుగా బద్వేలుకు చేరుకున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రప్ప, జలతోటి జయకుమార్, కొమ్మలపాటి ఓబులేసు, శ్రీను పాల్గొన్నారు.

## శాంతి ర్యాలీని విజయవంతం చేయండి

**– సయ్యద్ సలావుద్దీన్**

**కడప వైద్యవిభాగం, అక్టోబరు 19, ప్రభాతవార్త**



అమెరికా, ఇజ్రాయేల్, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీల దుర్మార్గం పరా కాష్టకు చేరింది. వీటి దుష్టచర్యల నుంచి పాలస్తీనీయులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా శనివారం జరిగే శాంతి ర్యాలీలో పాల్గొని నినదించాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్ని ప్రజా సంఘాలకు, అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ రాజకీయా లకు అతీతంగా కుల, మతాలకు అతీతంగా శనివారం జరిగే శాంతి ర్యాలీలో పాల్గొని ఇజ్రాయేల్ దాడులు ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

## బాబును వేధిస్తున్న ప్రభుత్వం

**– మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి**

**రాయచోటి, అక్టోబరు 19, ప్రభాతవార్త**



రాష్ట్ర మాజీ సీఎం తెదేపా అధినేత నారా చంద్రబాబును రాష్ట్ర ప్రభుత్వం వేధిస్తోందని రాయచోటి నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీనికి త్వరలో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. తెదేపా ప్రభుత్వం హయాంలో సంక్షేమం అభివృద్ధి పార్టీలకు తీతంగా ప్రతి ఒక్కరికి అందించామని ప్రజలందరికీ ఇప్పుడు అర్థమైందని వచ్చే ఎన్నికల్లో వైకాపాకు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం శ్రమించే చంద్రబాబుకు ప్రజలు ఎల్లప్పుడు అండగా ఉంటారని ఆయన తెలిపారు.

## పల్వరైజింగ్ మిల్లులను పరిశీలించిన ఏపీఎండీసీ అధికారులు



**ఓబులవారిపల్లె, అక్టోబరు 19, ప్రభాతవార్త:**

ఓబులవారిపల్లె మండలం మంగంపేట ఏపీఎండీసీ పరిధిలో ఉన్న పల్వరైజింగ్ ముగ్గురాయి నిరుపయోగంగా ఉన్న వాటిని అధికారులు పరిశీలించారు. హక్కు కలిగిన పల్వరైజింగ్ యజమానులకు ముగ్గురాయిని సరఫరా చేయించాలని పలువురు కోరుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి బ్యాంకు రుణాల ద్వారా పల్వరైజింగ్ మిల్లులు నిర్మించుకుంటే నష్టాల బాటలో వ్యాపారాలు నడుస్తూ అప్పుడు బాధతో ఆత్మహత్యలను పల్వరైజింగ్ మిల్లులు యజమానులు మూత వేసుకున్న దుస్థితికి వచ్చాయి. కరెంటు బిల్లులు కట్టలేక ఉండడంతో కొన్ని మిల్లులకు విద్యుత్తు కనెక్షన్లు కూడా కట్ చేశారు. ఈ నేపథ్యంలో కొంత మంది కొత్త దండ ప్రారంభిస్తూ బినామీ మిల్లులకు అగ్రిమెంట్లు చేయించుకొని నిరుపయోగంగా ఉన్న మిల్లుల ద్వారా డీవోలు కట్టి వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. అయితే ఈ వ్యాపారాలు కొంత మంది మాత్రమే వారి స్వలాభాలకు వారి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి లాభాలో సాగించి ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా హక్కు కలిగిన పల్వరైజింగ్ యజమానులకు ఏపీఎండీసీ అధికారులు జీవోల ద్వారా ముగ్గురే సరఫరా చేయించి వారికి జీవన ఉపాధి కల్పించాలని ఈ మిల్లులు మూతపడడంతో వందలాది మందికి ఉపాధి కరవై రోడ్లను పడే పరిస్థితి వచ్చిందని పలువురు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కేసులకు భయపడను ప్రశ్నిస్తూనే ఉంటా...

**టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి**

**ప్రొద్దుటూరుఅర్బన్ అక్టోబర్ 19, ప్రభాతవార్త**



అక్రమ కేసులకు భయపడనని సమాధానం వచ్చేంతవరకు ప్రశ్ని స్తూనే ఉంటానని టిడిపి ఇన్చార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేను ఎమ్మెల్యే పై ఏమి అబద్ధం చెప్పానో ఎమ్మెల్యే చెప్పాలని, నాకు ఎమ్మెల్యేపై ఎటువంటి వ్యక్తి గత కక్షాలేదని ప్రశ్నించే నా గొంతు నాది కాదని ప్రొద్దుటూరు ప్రజలదని నేను ప్రొద్దుటూరు ప్రజలతరుపున ప్రొద్దుటూరులో జరిగే అక్రమాలను ప్రశ్నించా నన్నారు. ఎమ్మెల్యే తన స్థాయిని దిగదార్చుకున్నాడని నేనేం దిగదార్చలేదన్నారు. ప్రొద్దుటూరుకు ఎమ్మెల్యే లుగా ఎంతోమంది పని చేశారని ఎవరిహాయంలో ఇంత అరాచకాలు జరగలేదని దోమలు లేని ప్రొద్దుటూరు చేస్తా అన్న ఎమ్మెల్యే ఇంత వరకు ఆపని చేయలేదని, దుమ్ము ధూళి గుంతల ప్రొద్దుటూరు ను చేశా రన్నారు. అసాంఘిక కార్యకలా పాలు, అపద్దపు హామీలు, ఆగినఅభివృద్ధి, అరాచకాలు-దౌర్జన్యాలు, అవినీతి ఈ ఐదు అంశాల పైన ఒక్కొక్క ప్రెస్ మీట్లో ఒక్కొక్క అంశాన్ని ప్రొద్దుటూరు ప్రజలకు వివరిస్తానని ఈ ఐదు అంశాలకు ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు.

ప్రముఖ క్రికెట్ బుకీ ఏలే నరసింహ ఎమ్మెల్యే పక్కన కూర్చుని రాష్ట్రానికి సీఎం జగన్ అయితే ప్రొద్దుటూరుకు సీఎం రాచమల్లు అనడంలో ఆంతర్యం ఏంటన్నారు. 2020లో అడిషనల్ ఎస్పీ చక్రవర్తి హయాంలో క్రికెట్ బుకీలపై కేసు నమోదు చేసినపుడు అప్పుడు అసాంఘిక కార్యకలాపాలు ఆపమని ఎందుకు పోలీసులను అడగలేదన్నారు. ప్రొద్దుటూరు ప్రజలపై ఎమ్మెల్యేకు ప్రేముంటే సర్కిల్లో ఇన్స్పెక్టర్ ఇబ్రహీంను మార్చాలని, అసాంఘిక కార్యకలాపాల ఆపేందుకు 3 నెలల టైం ఎందుకు 3 రోజులు చాలదా అన్నారు. దొంగనోట్ల కేసులో ఎమ్మెల్యేకు లేదని నిరూపించేందుకు కాల్ డేటా మీడియా సమక్షంలో బయటపెట్టగలరా అని ప్రశ్నించారు. 4 1/2 సంవత్సరాల నుండి ఎమ్మెల్యే అసాంఘిక కార్యక్రమాలను ఎందుకు ప్రోత్సహించారో చెప్పాలన్నారు.

## హెల్మెట్ గురించి అవగాహనాకార్యక్రమం

**చిన్నమండెం, అక్టోబర్ 19(ప్రభాతవార్త):**



ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి ప్రమాద సమయంలో రక్షింప బడాలని చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. గురువారం మండల పరిధిలో పలువురు ద్విచక్ర వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన ఎంతో ఉపయోగం ఉంటుం దన్నారు. రహదారి నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఆయన సూచించారు.

## విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలి : ఎస్ఇ

**చిన్నమండెం, అక్టోబర్ 19(ప్రభాతవార్త):**



విద్యుత్ శాఖ ఉమ్మడి కడప జిల్లా సర్వోన్నతాధికారి రమణ గురువారం చిన్నమండెం మండల సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉపయోగపడే పరికరాలను సిబ్బందికి అందజేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసి కాలిపోకుండా ఉండేందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. జగనన్న కాలనీలో విద్యుత్ దీపాలంకరణ పనులు, సర్వీస్ మంజూరు చేయడంలో జాప్యం జరగకుండా తగిన చర్యలు తీఉసకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డికి సూచనలు చేశారు. ఎఫ్ క్లాస్, డీసీ లిస్టును పరిశీలించి తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. రివ్యూ మీటింగ్ కండక్ట్ చేసి విద్యుత్ బకాయిలను వసూలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, లైన్‌మెన్లు, ప్రజలు పాల్గొన్నారు.

## రాజంపేట అమ్మవారిశాలలో తోటోత్సవం

**మోహిని అలంకారంలో వాసవిమాత**



**రాజంపేట అర్బన్, అక్టోబరు 19 ప్రభాతవార్త**

రాజంపేట అమ్మవారిశాలలో గురువారం తోటోత్సవం కన్నులపండువగా జరిగింది. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, వృక్షాలు, ఆకులతో అమ్మవారి శాల పచ్చదనంతో కళకళలాడింది. మరోవైపు అద్దాల మండపంలో బొమ్మల కొలువు భక్తులను ఆకట్టుకొంది. జగజ్జనని, లోకపావని, దుర్గామాత, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, సంతానలక్ష్మి ఇలా ఎన్నో పేర్లతో పిలుచుకునే అమ్మవారి రూపాలను బొమ్మల కొలువులో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఐదో రోజున వాసవిమాత మోహిని అలంకారంలో దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆర్యవైశ్య సోదరులకు సమారాధన కార్యక్రమంలో భాగంగా అన్నప్రసాద వితరణ చేశారు. పాతబస్టాండులోని మారమ్మతల్లి ఆలయంలో ఐదవ రోజున గ్రామదేవత లలిత త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. బోయపాళెం, మంగలమిట్ట ప్రాంతాల భక్తులు, ఉభయదారులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

## రేపటి నుంచి శిల్పారామంలో దసరా ఉత్సవాలు

**– పాత్రికేయుల సమావేశంలో శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి**

**కడప కార్పొరేషన్, అక్టోబరు 19, ప్రభాతవార్త**

దసరా పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకొని నగర రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద గల స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిల్పారామం కడప వారి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉత్సవాలలో మిస్సా మూవీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో టీవీ యాంకర్లు, కమెడియన్లు, టీవీ ఛానళ్ల డ్యాన్స్ మాస్టర్లతో పలు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. కావునా నగర వాసులు తప్పక హాజరై దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

## నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

**– నాడు నేడు జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్**

**రాయచోటి రూరల్. అక్టోబరు 19, ప్రభాతవార్త:**

జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీలలో జరుగుతున్న 2వ విడత నాడు-నేడు పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా నాడు-నేడు కోఆర్డినేటర్ మరియు జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కరుణాకర్ కోరారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పూర్వపు కడపకు చెందిన 15 మండలాల విద్యాశాఖాధికారులు, ఫీల్డ్ ఇంజినీర్లు, అంగన్‌వాడీ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో నాడు-నేడు పనుల మీద సమీక్షా సమావేశం జరిగింది. ఈనెలాఖరులోపు అన్ని అంగన్‌వాడీలలో అదనపు తరగతి గనులపై కప్పు నిర్మాణం, మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. ఏదైనా పాఠశాలల్లో ఈనెలాఖరుకు సివిల్ పనులను ఇన్ ప్రోగ్రెస్ స్టేజీలో ఉంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాధికారుల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ అసదుల్లా, రాయచోటి మండల విద్యాశాఖాధికారి బాలాజీ నాయక్, 15 మండలాల మండల విద్యా శాఖాధికారులు, ఫీల్డ్ ఇంజినీర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**కడప అక్టోబర్ 19, ప్రభాతవార్త**



సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద మంజూరైన రూ. 12 లక్షల ఎల్ ఓ సి, రూ. 70 వేల చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష మాట్లాడుతూ.... పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదప్రజలకు ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 8 మందికి పైగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద లివర్ ట్రాన్స్ ప్లాంట్ చికిత్సకు దాదాపు ఒక్కరికి 30 లక్షలు పైగా సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బలస్వామి రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు నరపురెడ్డి సుబ్బా రెడ్డి, తోట కృష్ణ, వైఎస్సార్సీపి నాయకులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న స్మార్ట్ సిటీలో తక్కువ ధరకే స్థలాలు

**ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి**



పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ సిటీలో తక్కువ ధరకే స్థలాలు అందుబాటులో వున్నాయని, ప్రొద్దుటూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని కొర్రపాడు రోడ్డు, మైదుకూరు, జమ్మలమడుగు ఔటర్ రింగ్ రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ సిటీ కి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఎంపిపి శేఖర్ యాదవ్, గోపవరం సర్పంచ్ మోషా, ప్రొద్దుటూరు మున్సిపల్ ఛైర్మన్ భీమునిపల్లె లక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్లు బంగారు రెడ్డి, ఖాజామోహిద్దీన్ లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ ఎటువంటి వివాదాస్పదం కానీ ప్రభుత్వ భూమిలో జగనన్న స్మార్ట్ సిటీ లేఔట్ ను ఏర్పాటు చేశామని 45 ఎకరాలు వున్న ఈ స్థలంలో ప్రభుత్వం రోడ్డు, డ్రైనేజీ, పార్క్, ఫుట్ పాత్ వంటి సౌకర్యాలతో సెంటు 5 లక్షల రూపాయలతో అందిస్తున్నా మని, 3,4,5 సెంట్ల ప్లాట్లు అందుబాటులో వున్నాయని, ప్రొద్దుటూరు ప్రజలు ఆన్లైన్ లో 10 శాతం బుకింగ్ చేసుకోని మిగిలిన మొత్తాన్ని ఇన్ స్టాల్‌మెంట్‌లో పే చేసుకునే సదుపాయం ప్రభుత్వం వారు కల్పిస్తున్నారని వివరిం చారు. నివాసానికి అనువైన ప్రాంతమని, ఎవరైనా భవిష్యత్తులో రిజిస్ట్రేషన్ తర్వాత అమ్ము కుని లాభాలు గడించే అవకాశం ఉందని తెలిపారు. దాదాపు 484 ప్లాట్లు వున్న ఈ వెంచర్ లో 50 శాతం బుకింగ్ జరిగాయని పేర్కొన్నారు. ఈ స్థలాలు విక్ర యించిన మొత్తం కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా)కి వెళ్లి తిరిగి ప్రొద్దుటూరు పట్టణాభివృద్ధికే వినియోగిస్తామని వివరించారు. కార్యక్రమంలో కౌన్సి లర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మిదేవి, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, పిట్టా బాలాజీ, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, కుడా అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణదేవి అలంకారంలో వాసవీమాత

**మైదుకూరు అక్టోబర్ 19, ప్రభాతవార్త**



శరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా అంగరంగ వైభవంగా జరుగు తున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఐదవ రోజు గురువారం మైదుకూరు వాసవిమాత అన్న పూర్ణ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సకల జీవరాశికి ఆహారం ప్రసాదించే అన్నపూర్ణ దేవిగా అలంకృతమైన అమ్మవారిని దర్శించుకునేం దుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఓ చేతిలో అక్షయపాత్ర, మరో చేతిలో గరిట పట్టి మానవాళి ఆకలి దప్పులను తీర్చే తల్లి అన్నపూర్ణ దేవి రూపం భక్తుల్లో పారవశ్యాన్ని నింపుతోంది. ప్రాణికోటికి జీవనాధారం అన్నం. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. సాక్షాత్తు పరమేశ్వరుడికే భిక్షపెట్టిన దేవత అన్నపూర్ణాదేవి. ఈ తల్లిని ధ్యానిస్తే ధనధాన్యవృద్ధి, ఐశ్వర్య సిద్ధి కలుగుతాయి. అన్నపూర్ణాదేవి ధరించిన రసపాత్ర అక్షయ శుభాలను అందిస్తుందని ప్రజల నమ్మకం.

## దుప్పట్లు పంపిణీ



**ప్రొద్దుటూరు అర్బన్ అక్టోబర్ 19, ప్రభాతవార్త**

ఈడమడక మాజీ సర్పంచ్ తాటి సుబ్బరాయుడు భార్య తాటి సంజమ్మల 43వ వర్ధంతి సందర్భంగా వీరి జ్ఞాపకార్థం వీరి కుమారుడు మాజీ కౌన్సిలర్ తాటి శ్రీనివాస్ వీరి కుమార్తెలు ఇడమడక సర్పంచ్ చింతలపూడి నర్సమ్మ ఆరెద్దుల సుజాతమ్మ వైఎంఆర్ కాలనీ సాయిబాబా గుడి వద్దగల సుమారుగా 50 మంది యాచకులకు దుప్పట్లు స్వీట్లు పంపిణీ చేశారు.

## ప్రముఖ బంగారు షాపులపై ఐటీ తనిఖీలు

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 19, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో ప్రముఖ బంగారు దుకాణాలైన బుశెట్టి జ్యువెలర్స్, తల్లం శేషసాయి జ్యువెలర్స్, గురురాఘవేంద్ర జ్యువెలర్స్ తదితర వాటిపై కేంద్ర పన్నుల శాఖాధికారులు తమిళనాడుకు చెందిన పోలీసు అధికారులతో గురువారం సాయంత్రం నుంచి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే వారి ఇళ్లు తదితర ప్రదేశాలనఉ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలు రాత్రి కూడా కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది గతంలో ఎప్పుడు తనిఖీ చేసినా రాష్ట్ర స్థాయి అధికారులు మాత్రమే తనిఖీ చేసేవారని, ప్రస్తుతం కేంద్రానికి సంబంధించి ఆదాయ పన్నుల శాఖాధికారులు తనిఖీలు చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.



**ప్రొద్దుటూరు అక్టోబర్ 19, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు శ్రీ రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవి వనవిహారిని దేవి అలంకారం

## ఎమ్మెల్యేను విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

**కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి**

**ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 19, ప్రభాతవార్త**



రెండు సార్లు ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా గెలిచిన రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ని విమర్శించే స్థాయి కౌన్సిలర్గా కూడా గెలవని టిడిపి ప్రొద్దుటూరు ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డికి లేదని ఆయన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని 4వ వార్డ్ కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక వైఎంఆర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి పదేపదే ఎమ్మెల్యే రాచమల్లును అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని అసత్య ఆరోపణలు చేయడం, ప్రతి సారి సూటిగా ప్రశ్నిస్తున్నా అంటూ మాట్లాడటం సరి కాదన్నారు. ఈ అసాంఘిక కార్యక్రమాలన్నీ ఆయన ఇంట్లోనే వుండి ఎమ్మెల్యే ను విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించడంలా వుందన్నారు. ప్రవీణ్ అబ్బ కోగటం వీరారెడ్డి నాటు సారా అమ్మే వాడని, ప్రవీణ్ తండ్రి ప్రతాపరెడ్డి కల్తీ మద్యం విక్రయించేవాడని, మనోరంజనీ అంబూజ్మెంట్ పార్క్ నిర్వహించారని, అధిక వడ్డీలతో ప్రజలను ఇబ్బంది పెట్టారని, మట్కా కూడా వారింట్లో వారే నిర్వహించే వారని విమర్శించారు. ఈ కార్యక్రమాలు ప్రవీణ్ కుటుంబ సభ్యులు చేశారని తాను ఎక్కడైనా ప్రమాణం చేస్తానని, చేయలేదని ప్రవీణ్ ప్రమాణం చేయగలడా అని సవాల్ విసిరారు. టిబి రోడ్డులో దుమ్ము లేస్తోందని ప్రవీణ్ పేర్కొన్నారని, అక్కడ పైప్ లైన్ వర్క్ జరిగే విషయం ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. సివిల్ ఇంజనీర్ అయిన ప్రవీణ్ పైప్ లైన్ వర్క్ జరిగిన తరువాత మరమ్మత్తులు వస్తాయేమో అనే అలాగే వుంచారని, త్వరలోనే పరిష్కరిస్తారని వివరించారు. శాంతియుతంగా వున్న ప్రొద్దుటూరులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి ప్రవీణ్ లబ్ధి పొందాలని చూడటం అవివేకమన్నారు. ఇకనైనా ప్రవీణ్ పద్ధతి మార్చుకొని, హుందాగా ప్రవర్తించాలని హితువు పలికారు. ఇకపై ప్రవీణ్ ప్రశ్నలు సంధిస్తే తాము ప్రశ్నలతోనే స్పందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పుల్లారెడ్డి, రాయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న స్మార్ట్ సిటీ మధ్య తరగతి ప్రజలకు వరం

**ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి**

**ప్రొద్దుటూరు రూరల్ అక్టోబర్ 19, ప్రభాతవార్త**



జగనన్న స్మార్ట్ సిటీ మధ్య తరగతి ప్రజలకు వరంలాంటిదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని కొర్రపాడు రోడ్డు, మైదుకూరు, జమ్మలమడుగు ఔటర్ రింగ్ రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ సిటీ కి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఎంపిపి శేఖర్ యాదవ్, గోపవరం సర్పంచ్ మోషా, ప్రొద్దుటూరు మున్సిపల్ ఛైర్మన్ భీముని పల్లె లక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్లు బంగారు రెడ్డి, ఖాజామోహిద్దీన్ లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ సిటీ లో తక్కువ ధరకే స్థలాలు అందుబాటులో వున్నాయని, ప్రొద్దుటూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎటువంటి వివాదాస్పదం కానీ ప్రభుత్వ భూమిలో జగనన్న స్మార్ట్ సిటీ లేఔట్ ను ఏర్పాటు చేశామని 45 ఎకరాలు వున్న ఈ స్థలంలో ప్రభుత్వం రోడ్డు, డ్రైనేజీ, పార్క్, ఫుట్ పాత్ వంటి సౌకర్యాలతో సెంటు 5 లక్షల రూపాయలతో అఅందిస్తున్నామని, 3,4,5 సెంట్ల ప్లాట్లు అందుబాటులో వున్నా యని, ప్రొద్దుటూరు ప్రజలు ఆన్లైన్ లో 10 శాతం బుకింగ్ చేసుకోని మిగిలిన మొత్తాన్ని ఇన్ స్టాల్ మెంట్ లో పే చేసుకునే సదుపాయం ప్రభుత్వం వారు కల్పిస్తున్నారని వివరించారు. నివాసానికి అనువైన ప్రాంతమని, ఎవరైనా భవిష్య త్తులో రిజిస్ట్రేషన్ తర్వాత అమ్ముకుని లాభాలు గడించే అవకాశం ఉందని తెలి పారు. దాదాపు 484 ప్లాట్లు వున్న ఈ వెంచర్ లో 50 శాతం బుకింగ్ జరిగాయని పేర్కొన్నారు. ఈ స్థలాలు విక్రయించిన మొత్తం కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) కి వెళ్లి తిరిగి ప్రొద్దుటూరు పట్టణాభివృద్ధికే వినియోగిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మిదేవి, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, పిట్టా బాలాజీ, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, కుడా అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



**కడప అక్టోబర్ 19, ప్రభాతవార్త**

కడప కెఎస్ఆర్ ఎం ఇంజనీరిం గ్ కళాశాలలో కళాశాల కల్చరల్ కమి టీ విభాగం వారి ఆధ్వర్యంలో నూత న బీ.టెక్ విద్యార్థులకు ఆరాబ్ద్ -2%ఎ%23 ఫ్రెషర్స్ డే ని కళాశాల సభా సమావేశ మందిరంలో గురు వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్, ట్రేసరరీ సెక్రెటరీ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ బీ.టెక్‌లో ప్రవేశం కళాశాల ఎంపిక ప్రధానమని, నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యను కాలాన్ని సద్వినియోగం చేసుకొని స్నేహ భావంతో మెలగాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించు కొని క్రమ శిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలనీ పేర్కొన్నారు. అనంతరం కళాశాల మేనే జింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలు పుతూ మీ జీవితంలో ఈరోజు చిరస్మరణీయం అనీ, ఈ నాలుగు సంవత్స రాలు కళాశాల వనరులను ఉపయోగించుకొని అంకిత భావం, పటిష్ట ప్రణాళికతో పట్టుదలతో తల్లిదండ్రుల ఆశయా లను నిలబెట్టి, సమాజంలో ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రదానాచార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి మాట్లా డుతూ ప్రతి విద్యార్థి లక్ష్యం వైపు దృష్టి పెట్టి బలాలు బలహీనతలు అంచనా వేసుకొని ప్రతిభ చూపాలని తెలియ జేశారు కార్యక్రమంలో ప్రధానాచార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్ , వివిధ విభాగాదిపతులు డీన్లు, కల్చరల్ కమిటీ సమన్వయ కర్త వీర శంకర్, హ్యూమన్ రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్ లీనా రస్థాపూర్, బోదన, బోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజంపేటలో పలువురు బిజెపిలో చేరిక

**రాజంపేట అర్బన్, అక్టోబరు 19 ప్రభాతవార్త**



రాజంపేట మండలంలో గురువారం పలువురు యువకులు, కాపు యువ నేతలు భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, రాష్ట్ర నేత చంద్రమౌళి సమక్షంలో న్యాయవాది తోట ధీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బిజెపి కండువాలు వేసి స్వాగతం పలికారు. అంతకుముందు తాళ్లపాక నుంచి ఆర్ అండ్ బి బంగ్లా వరకు యువకులు బైకుర్యాలీ నిర్వహించి అల్లూరి సీతారామ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత బిజెపిలో చేరి దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి చంద్రమౌళి పిలుపునిచ్చారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ రామ్‌జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కృష్ణయాదవ్, ప్రశాంత్, ఆనంద గజపతిరాజు, ఆకుల కృష్ణమూర్తి పాల్గొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారిలో తోట ధీరజ్‌కుమార్, మల్లికార్జునరాజు, లక్ష్మీ పతి, రాజు, చందు, వెంకి, తులసీ రాం, బబ్లూ, ప్రభాకర్, రేనాటి సాయి రాజు, ధనుష్‌రాజు, బొడిచెర్ల లక్ష్మీపతి ఉన్నారు.

### పాసుపోర్టు పోయినది

కుర్రపోతుల రాధారాణి, భర్త రెడ్డెప్ప డి.నెం. 21/47, జి.బోయనవడ్డిపల్లి గ్రామం, గాలివీడు మం॥, అన్నమయ్య జిల్లా, ఎ.పి. తిరుపతి నుండి గాలివీడుకు ఇల్లు మారుతుండగా మార్గ మధ్యంలో నా పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. N3330628. దొరికిన వారు పైఅడ్రస్‌కు తెలుపగలరు. సెల్ : 7569790072.

## కలికిరిలో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం

కలికిరి, అక్టోబరు 19, ప్రభాతవార్త:



కలికిరికి గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ఇటీవల వైకాపా తీర్థం పుచ్చుకున్న వైసీపీ మైనార్టీ యువనాయకుడు ఎస్.హనీఫ్ ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి ఎమ్మెల్యే రావడంతో ఎమ్మెల్యేని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హనీఫ్ అనుచరులు, వైసీపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తంబళ్ల మురికి నీటి కాలువలతో దశ తిరిగింది

తంబళ్లపల్లె, అక్టోబరు 19, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో దశాబ్దాలుగా మురికినీటి కాలువల సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో సర్పంచ్ నీలూ మైనుద్దీన్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే తీవ్రంగా స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన తంబళ్లపల్లె నియోజకవర్గ పురవీధుల్లోని ప్రతి వీధికి మురికి నీటి కాలువలు నిర్మించి పారిశుద్ధ్యం మెరుగుతో పాటు తాగునీటి సౌకర్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధి కారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీహరి, ఏఈ అశోక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శేషాద్రిల ఆధ్వర్యంలో పనులు నిర్వాహకు డు కొండప్పల సారథ్యంలో శరవేగంగా మురికినీటి కాలువల నిర్మాణాలు చేపట్టా రు. మసీదు వీధి, సర్పంచ్ వీధి, విశ్వనాథరెడ్డివీధి, సిద్ధారెడ్డిగారిపల్లె క్రాస్‌రోడ్డు, పెద్దమండెం రోడ్డుల నుంచి పనులు వేగం అందుకున్నాయి. కాలువల నిర్మాణా లపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, సర్పంచ్‌నీలూ మైనుద్దీన్,అధికారులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగళ్లు కేసులో టీడీపీ నాయకులకు బెయిల్ మంజూరు



ములకల చెరువు, అక్టోబరు 19, ప్రభాతవార్త:

తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల సందర్భాన పర్యటనలో భాగంగా తంబళ్లపల్లి నియోజకవర్గం అంగళ్లులో పర్యటించారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో తెదేపా నాయకులపై అక్రమ కేసులు పెట్టారు. ఈ కేసుల్లో కేసు నంబరు 75, 79లో ఉన్న టీడీపీ నాయకులు ములకల చెరువు మండల కన్వీనర్ పాలగిరి సిద్ధా, బి.కొత్తకోట మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, కురబలకోట మండల కన్వీనర్ వై.జి.సురేంద్ర, తంబళ్లపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రమణ, తంబళ్లపల్లె క్లస్టర్ ఇన్‌ఛార్జి బేరీ శ్రీనివాసులు, శంకర్ యాదవ్, వ్యక్తిగత సహాయకుడు నాగార్జున, ఐటీడీపీ అధ్యక్షుడు సాగర్‌కుమార్, బురకాయలకోట శ్రీనివాసులు నాయుడు తదితరులు గురువారం మదనపల్లి సెషన్స్ కోర్టులో బెయిలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెదేపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమండ్యం, మండల కన్వీనర్ జిల్లా వెంకటరమణ, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, రాజంపేట కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శివ, సిద్దారెడ్డి, చింతకుంట్ల కేశవులు, రాజారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి రమణారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష

పీలేరు, అక్టోబరు 19 ప్రభాతవార్తః



జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష లాంటిదని ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నాలుగో సచివాలయం పరిధిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీపీ షుగర్, మలేరియా, డెంగూ కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 552 మందికి వైద్యసేవలు నిర్వహించారు. నలుగురిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. మందులను ఉచితంగా ఇచ్చారు. ఈకార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ షఫీ, డాక్టర్ సతీష్‌కుమార్, ఈఓ ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

## శ్రీకాత్యాయని దేవి అలంకరణలో శ్రీశ్రీశ్రీ రౌద్రాల అలంకాళమ్మదేవత

పీలేరు, అక్టోబరు 19 ప్రభాతవార్తః



స్థానిక శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో దేవీ నవరాత్రులలో భాగంగా ఐదవరోజు అమ్మవారిని శ్రీకాత్యాయనీ దేవి అలంకరణచేసి అభిషేకాలు, పూజలు అర్చకులు కష్ణస్వామి, ఆంజినేయులు భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఛైర్మన్ , పాలకమండలి సభ్యులు మాధవరం భాస్కర్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఉర్దూబాష ప్రాచుర్యాన్ని విస్తరింప చేయాలి

రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

పీలేరు, అక్టోబరు 19 ప్రభాతవార్తః

ఉర్దూ బాష ప్రాచుర్యాన్ని గొప్పతనాన్ని విశిష్టతను విస్తరింపచేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ కోరారు. గురువారం వాల్మీకిపురంలోని ఉర్దూ అకాడమీ కేంద్రంలో నిర్వహించిన అభివద్ది కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉర్దూ బాష ఎంతో ప్రాచీనమైనదని, ఈబాష తియ్యదనాన్ని మాధుర్యాన్ని ప్రతి ఒక్కరు ఆస్వాదించే విధంగా స్థానిక ఉర్దూ అకాడమి కేంద్ర అభివద్ది కమిటీ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉర్దూ బాషను ద్వితీయ బాషగా అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉర్దూ బాషలో ఆయా కార్యాలయాల బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉర్దూ అకాడమి అభివద్ది కమిటీ సభ్యులు ఇలాంటి అంశాలపై శ్రద్ద చూపాలని దీనివలన ఉర్దూ బాష ఔన్నత్యం మరింత పెరుగు తుందన్నారు. అలాగే రెండు, మూడు నెలలకోసారి ఉర్దూ బాషకు సంబంధించిన సాహితి కార్యక్రమాలను నిర్వహించాలని ఇందులోభాగంగా ఉర్దూ కవి సమ్మేళనా లు, సెమినార్లు, ఉర్దూబాష వలన కలిగే ప్రయోజనాలు గురించి వివరిస్తూ ప్ర త్యేక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ సెక్రటరీ మస్తాన్ వల్లి ఈసందర్భంగా వీడియో కాన్ఫ రెన్సులో మాట్లాడుతూ ఉర్దూ బాషాభివద్దికి, ఉర్దూ అకాడమీ సేవల విస్తరణకు కమిటీల సభ్యులు, బాషాభిమానులు సహకరించాలన్నారు. వాల్మీకిపురంలో ఉర్దూ అకాడమీ కేంద్రంలో వసతుల కల్పనకు విరాళాల రూపంలో సహకరించిన దాతలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. కమిటీ కన్వీన్ జవాద్‌హుస్సేన్, మాట్లా డుతూ జిల్లాలలో వాల్మీకిపురం ఉర్దూ బాషకు పుట్టినిల్లు వంటిదని ఉర్దూ సాహి తీ కార్యక్రమాలకు ఇక్కడే అంకురార్పణ జరిగిందని గుర్తుచేశారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు సయ్యద్ కరీమ్‌సాహెబ్ ఈసందర్భంగా రూ.5వేలు నగదు విరాళంగా అందించారు. దాతలు కరీమ్ సాహెబ్, షబ్బీర్లను సత్కరించారు. ఈ సమావేశ కమిటీ అధ్యక్షులు అమీర్ హుస్సేన్, కన్వీనర్ జావీద్‌హుస్సేన్, మం డల కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, హైస్కూల్ రిటైర్‌మెంటు హెచ్‌ఎం జీఎస్ బషీర్‌అహ్మద్, సహారా ట్రస్టు అధ్యక్షులు సాదిక్‌అహ్మద్, టీచర్ మహ బూబ్ అలీకాన్, గ్రంథాలయ అధికారులు ఆబిద్‌హుస్సేన్, జావీద్‌హుస్సేన్ కం ప్యూటర్ సెంటర్ ఇన్‌చార్జి అలీఖాన్ పాల్గొన్నారు.

## మాదిగల విశ్వరూప పాదయాత్రకు సంఘీభావం

పీలేరు, అక్టోబరు 19 ప్రభాతవార్తః



మహజన నేత మాన్యశ్రీ మందకష్ణమాదిగ ఆదేశానుసారం షెడ్యూల్ కులాల వర్గీకరణ సాధన లక్ష్యంలో భాగంగా ఆలంపూర్ నుంచి హైదరాబాదుకు మాన్యశ్రీ మందకష్ణమాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప మహాపాదయాత్రకు సంఘీభావంగా ఎంఎస్‌పీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గ పరిధిలో బుధవారం నిర్వహించిన సంఘీభావ యాత్రకు ముఖ్య అతిధులుగా అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి కేఎన్ రాజు మాదిగ, ఎమ్మార్పీయస్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మాదిగలు హాజరైయ్యారు. వీరితో పాటు అమరాల వెంకటరమణ, సీనియర్ నాయకులు ఎంఎస్‌పీ వాల్మీకిపురం కన్వీనర్ ముల్లంగి రెడ్డెప్ప మాదిగ, ముల్లంగి గురవయ్య, ఈపూరి వెంకటరమన, దండు రమణ, ఎంఈఎఫ్ నాయకులు సంగీతం రవీశ్వర మాదిగలు హాజరైనారు. ఈసంఘీభావ యాత్రకు కేవి.పల్లె మండలం వగళ్ల పంచాయతీ కొండకిందపల్లె హరిజనవాడలో ప్రారంభం కాగా నియోజకవర్గం యువసేన అధ్యక్షులు విశ్వనాద మాదిగ, మాజీ మండలాధ్యక్షులు ఆదినారాయణ(యువరాజ్) ఆధ్వర్యంలో ఆగ్రామానికి వచ్చిన ఎమ్మార్పీయస్, ఎంఎస్‌పీ నాయకులకు బాజా భజంత్రీల మధ్య మంగళహారతులతో స్వాగతం పలికి సంఘీభావ యాత్ర నిర్వహించారు. మాదిగల ఉప కులాలకు సంపూర్ణత న్యాయం జరగాలంటే ఏబీసీడీ వర్గీకరణ ఒక్కటే మార్గమని అది సాధించాలంటే నవంబరు 7వ తేదీ హైదరాబాదులో జరగబోవు మాదిగల విశ్వరూప మహాసభకు 20నుంచి 30లక్షలు మంది తో సభకు వచ్చేలా చూడాలని అన్నగారు సూచించడం జరిగిందన్నారు. గ్రామస్థాయి నుంచి మొదలు పెట్టకుంటే జిల్లా స్థాయి వరకు విశ్వరూప మహాసభకు తరలించాలని తెలియజేయడం జరిగింది.మహజన నేత మందకష్ణ మాదిగ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని పీలేరు, వాల్మీకిపురం, కేవి.పల్లె మండలాల ఎమ్మార్పీయస్, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొనడం జరిగిందన్నారు. అలాగే నియోజకవర్గంలో మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్పీటీసీ

కేవి.పల్లె, అక్టోబరు 19 ప్రభాతవార్తః



మండలంలోని బుర్రావాండ్లపల్లె వేణుగోపాల్‌స్వామి ఆలయం వద్ద మహాభారత యజ్ఞం జడ్పీటీసీ దంపతులు గజ్జల శ్రుతి శీనురెడ్డిలు నిర్వహించారు. అనంతరం కేవి.పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించగా పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు గజ్జల శ్రుతి శీనురెడ్డిలు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో కోచ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ : ఒకరు మృతి

పీలేరు,అక్టోబరు 19 ప్రభాతవార్తః



రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మతిచెందిన సంఘటన పీలేరు పట్టణంలోని చిత్తూరు రోడ్డు మార్గంలో చోటు చేసుకుంది. వివరాలు పీలేరుమండలం యర్రగుంటపల్లె పంచాయతీ మారం రెడ్డిగారిపల్లెకు చెందిన చంద్రారెడ్డి(68) తమ ద్విచక్రవాహనంలో పీలేరుకు వస్తుండగా నందలూరు మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన ఎం. ఆదికేశవులు, ఎం.పద్వీ, ద్విచక్రవాహనంలో అగ్రహారం పంచాయతీ ఎనములవారిపల్లెకు ద్విచక్రవాహనంలో తమ బంధువల ఇంటికి వచ్చారు. వారు పీలేరుకు వస్తుండగా ముందు వెళుతున్న చంద్రారెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఈప్రమాదంలో చంద్రారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలిస్తుండగా మార్గ మద్యంలో మతిచెందినట్లు బంధువులు తెలిపారు. బందువుల ఫిర్యాదు మేరకు ఎస్సై రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## కురవసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెడ్డిప్రసాద్

మదనపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త :



కురబసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బెల్లె రెడ్డిప్రసాద్ నియామకం అయ్యారు. రెండు రోజుల క్రితం ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ లో జరిగిన రాష్ట్ర స్థాయి కురబ కులస్థుల సమావేశంలో రెడ్డిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గతంలో ఇతను కురబ సంఘం ఉమ్మడి చిత్తూరుజిల్లాల జనరల్ సెక్రటరీగా, అన్నమయ్యజిల్లా సెక్రటరీగా సోమల మండలం అధ్యక్షునిగా పనిచేశారు. జాతీయ అధ్యక్షులు ఆర్.క్రిష్ణయ్య సహకారంతో చిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఈసందర్భంగా రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర పదవి తనకు ఇవ్వడం పట్ల అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కురబల సమస్యలపరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

## నడింపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష



రామసముద్రం, అక్టోబర్ 19 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలోని ఆర్ నడింపల్లె పంచాయితీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష జడ్పిటిసి సిహెచ్ రామచంద్రారెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదవాడికి అండగానిలుస్తున్న జగనన్న ఆరోగ్యసురక్ష ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనసకు సిఎం చేసిన ప్రతిజ్ఞను నిజం చేసేందుకు వైద్యఆర్యో సిబ్బంది గడప గడపకు తిరిగారన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, కొండూరు క్రిష్ణారెడ్డి, నందరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి,గెవన్న, సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ నందరెడ్డి, క్రిష్ణప్ప, నారాయణస్వామి, శివ, ఎంపిడిఓ నారాయణస్వామి, డిటి శ్రీనివాసరావు, డాక్టర్ లీల, అర్జున్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటికొతర ఇబ్బందులతో దేవాండ్లపల్లె వాసులు



కేవి.పల్లె, అక్టోబరు 19 ప్రభాతవార్తః

మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లెకి చెందిన మహిళలు నీటికోసం రోడ్డెక్కారు. గత 20 రోజులుగా మోటరు మరమ్మతులకు గురికావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నీరులేక ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. మాసమస్యను తీర్చండి మహా ప్రభో అంటూ సర్పంచికి , పంచాయతీ సెక్రటరీకి సమస్యను తెలుపగా సత్వరమే సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ సెక్రటరీ సిగ్బతుల్లా , ఈవో ఆర్డీ గఫూర్ తెలిపారు.

## మైఫోర్స్ మహేష్‌ను సన్మానించిన జిల్లా అధ్యక్షులు

మదనపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త :



జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన మైఫోర్స్ మహేష్‌ను చిత్తూరు జిల్లా ఉమ్మడి జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ సన్మానించారు. గురువారం చిత్తూరు పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ జనసేనపార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ విధి విధానాలను, ఆశయాలను ప్రజలకు తీసుకెలుతూ పార్టీ నిర్ణయించిన ప్రతి కార్యక్రమం ఇంటింటికి తీసుకెలుతూ మదనపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన మైఫోర్స్ మహేష్‌కు రాష్ట్ర స్థాయిలో పదవులు దక్కడం సంతోషకరమన్నారు. పార్టీలో కష్టపడే వారికి ఎప్పటికైనా మంచి పదవులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షులు అమరనారాయణ మహేష్‌ను ఘనంగా సత్కరించారు.

## డిప్యూటి సిఎంపై టిడిపి నేతలు ఆగ్రహం

మదనపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు టెర్రరిస్టులు అన్న డిప్యూటి సిఎం నారాయణ స్వామిపై రాజంపేట పార్లమెంట్ టిడిపిఅధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ మండిపడ్డారు. గురువారం పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటి సిఎం రెండు రోజుల క్రితం పుంగనూరులో తెలుగుదేశం కార్యకర్తలను టెర్రరిస్టులుగా అభివర్ణియించిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా నాయకులు చేస్తున్న తప్పుడు వాగ్దానాలు, అవలంభిస్తున్న విధానాలు ప్రజా వ్యతిరేకమైనవని ఘాటుగా విమర్శించారు. రాజకీయంగా చంద్రబాబునాయుడును ఎదుర్కోలేకనే అక్రమంగా అరెస్టు చేశారన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అన్న విషయాన్ని గుర్తించి హుందాగా మాట్లాడాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మద్యపాన నిషేదం చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.కార్యక్రమంలో నవీన్‌చౌదరి, ఉమేష్‌చంద్ర, గణేష్‌బాబు, మల్లికార్జున, నూర్‌జహాన్ పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం కోసమే ఆరోగ్య సురక్ష

డిఎల్‌డిఓ లక్ష్మీపతి

మదనపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త :



ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని డిఎల్‌డిఓ లక్ష్మీపతి తెలిపారు. గురువారం కొత్తవారిపల్లె పంచాయితీలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా ప్రతి ఇక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎండిఓ భానుప్రసాద్, సర్పంచ్ బుడ్డన్న, వైద్యులు గిరిధర్ నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని 27వ వార్డులోజగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపు కౌన్సిలర్ కరీముల్లా అధ్యక్షతన జరిగింది.

## అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం కారుసీజ్

రామసముద్రం, అక్టోబర్ 19 ప్రభాతవార్త :



మండలంలోని చెంబకూరు రోడ్డులో గురువారం ఉదయం ఎస్‌ఈబి అధికారులు దాడులు నిర్వహించారు. సెబ్ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇందులో భాగంగా అనుమానం కలిగిన కారును ఆపగా ఓ వ్యక్తి కారును ఆపకుండా వేగంగా మదనపల్లెవైపు వెళ్ళడంతో కారును వెంబడించారు. కారును వదలి వ్యక్తి పరారైనాడు. దీంతో కారులోని మూడు లక్షల విలువ కలిగిన కర్నాటక మద్యం, కారును సెబ్ అధికారులు సీజ్‌చేసినట్లు తెలిపారు.

## మిట్స్‌లో ఏంసిఏ విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన సదస్సు



కురబలకోట, అక్టోబర్ 19 ప్రభాతవార్త :

కురబలకోట మండలం అంగళ్ళుకు సమీపాన వెలసిన మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఏంసిఏ విద్యార్థులకు కెరీర్, పర్సనాలిటి డెవలప్‌మెంటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనం ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేరిప్‌పై శ్రద్ద వహించడమే కాకుండా ఆరోగ్య విషయాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మ విశ్వాసం, మావన ప్రయత్న, సాహసం, ధైర్యం సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం వంటివి విజయాలను, వైఫల్యాలను నిర్దేశిస్తాయన్నారు. మిలెట్స్ అనారోగ్యానికి కారణమయ్యే రోగాలను దూరం చేస్తాయన్నారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు, మొదలైన చిరుధాన్యాలుగా వర్గీకరించవచ్చు అయితే వీటిని తినడమే కాకుండా సరనైన రీతిలో ఒండడం కూడా ముక్యమన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విత్తనాల ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశం

– మండల వ్యవసాయాధికారి

జమ్మలమడుగు, అక్టోబరు 19, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లతో గురువారం మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు నాణ్యమైనవి రైతులకు విక్రయించాలని, కొనుగోలు దారులకు తప్పక రసీదులు ఇవ్వాలని సూచించారు. రిజిస్టరు తప్పక పాటించి నమోదు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో 1968 ప్రకారం తగిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలూరు మరియు ముద్దనూరు డీలర్లు పాల్గొన్నారు.

## పౌరసరఫరాల గోదాము తనిఖీ

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 19, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లె పౌరసరఫరాల గోదామును గురువారం అన్నమయ్య జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శివరామమూర్తి, జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం, మరియు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కడప వారు గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌక దుకాణాలకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువులను పరిశీలించారు. నాణ్యమైన సరుకులను చౌకదుకాణాలకు పంపిణీ చేయాలని గోదాం ఇన్‌ఛార్జి మల్లికార్జున బాబుకు ఆదేశించారు. అనంతరం గోదాం దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి నిత్యావసర సరుకులు చూడాలన్నారు. ఏవైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదాం ఇన్‌ఛార్జి మల్లికార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## చైతన్య అనాధశ్రమంలో చిన్నారులకు అన్నదానం

మదనపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త:



చైతన్య అనాధశ్రమంలో తల్లి జ్ఞాపకార్థంగా చిన్నారులకు అన్నదానం చేసినట్లు మదనపల్లె ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రమేష్‌రాయల్ తెలిపారు. నిమ్మనపల్లె మండలం చల్లావారిపల్లెకు చెందిన శాంతమ్మ ఐదవ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని చైతన్య అనాధశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థంగా ప్రతి వర్ధంతిరోజున ఏదో ఒక్క సేవా కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. తల్లి జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న కుటుంబసభ్యులను ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు క్రిష్ణమూర్తి, కల్పన, రమేష్‌రాయల్, మాలతి, చార్విక్, వేధిక్, జ్ఞాఫిక తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల్లో అలంకరణలో అమ్మవారు

రామసముద్రం, అక్టోబర్ 19 ప్రభాతవార్త :



మండలంలోని గుంతయంబాడీ గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గంపనపల్లె, కొండూరు, గుంతలపేటలోని చౌడేశ్వరీదేవి, కన్యకాపరమేశ్వరీ, తిరుమలరెడ్డివారిపల్లెలోని మారెమ్మ ఆలయంలో పలు రకాల పుష్పాలతో అమ్మవారిని పూజలు చేశారు. దశరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నిమ్మనపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త :



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జడ్పిటిసి ప్రమీళ రమణారెడ్డి అన్నారు. గురువారం నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యకులు సదాశివరెడ్డి, ఎంపిపి నరసింహులు, సచివాలయ కన్వీనర్ రామ్ మోహన్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ శేషగిరిరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విరివిగా ప్రత్యేక పూజలు

రాయచోటి రూరల్. అక్టోబరు 19, ప్రభాతవార్త:

పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలోని శ్రీభద్రకాళీ సమేత వవీరభద్ర స్వామి వారికి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి సతీమణి మాధవిరెడ్డి గురువారం ఉదయం అభిషేకం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి సతీమణి మాధవిరెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలికి ఆమె చేత ప్రత్యేక పూజలు గావింపజేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మాధవిరెడ్డిని ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. రాయచోటి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి సతీమణి మాధవిరెడ్డి పూజలు నిర్వహించారు.

## సమస్యలపై వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశము

### లేవనెత్తినా సమావేశంలో సమస్యలపై స్పందన కరువు

గుర్రంకొండ, అక్టోబర్ 19, ప్రభాతవార్త



గుర్రంకొండ మండల సర్వసభ్య సమావేము ప్రజాప్రతినిధులు సమస్యలపై అధికారులు నిలదీయడంతో వాడివేడిగా జరిగింది. సమస్యలు లేవనెత్తినా వాటిని పరిష్కరించాల్సిన అధికారులు స్పందించకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యులు అప్పల్లు, సింగిల్‌వెండ్ అధ్యక్షులు నక్కా చంద్రశేకర్, మండల ఆర్‌బికె అధ్యక్షులు జయచంద్రారెడ్డిలు మాట్లాడుతూ రీ సర్వేలో ప్రతి రైతుకూ సర్వేనెంబర్‌లు తప్పుగా వున్నా మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ఉన్నది ఒక రకం అయితే రైతుకు భూమి మరో రకంగా ఆన్‌లైన్‌లో చూపిస్తుంటే ఇదెక్కడి సర్వేనని రైతులు ముక్కున వేలేసుకొంటున్నారు. సర్వే సరిగా చేయలేనప్పుడు ముందు వున్నవే సక్రమంగా వున్నాయని అయితే సక్రమంగా లేని రైతులు సరిచేసుకొనుటకు తహశీల్ధార్ కార్యాలయానికి వెళ్తే అక్కడ ఒకరిపై మరొకరు చెప్పుకోవడం నిర్లక్ష్యంగా సమాధానం చేయడం వంటివి చేస్తున్నారని అన్నారు. సచివాలయం 2 విఆర్వో అవినీతి గురించి ఎంపిటిసి ఖదీర్ మాట్లాడుతూ హౌసింగ్ అప్లికేషన్‌కి పోయిన ప్రతి ఒక్కరి దగ్గర రూ. 10వేల నుండీ రూ. 15వేల వరకూ వసూలు చేస్తున్నారని అన్నా పై అధికారులు నోరు మెదపడంలేదని అన్నారు. విఆర్వో గురించి మాట్లాడుతున్నా తహశీల్ధార్ ఆ విఆర్వోను వెనుకేసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ విఆర్వోపై ఉన్నతాధికారులకు ఫిర్యాధులు వెల్లువెతుతున్నాయి. ప్రతి పనికి రైతుల దగ్గర డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు కూడా తెలిపారు. హౌసింగ్ దరఖాస్తు చేసుకొంటే అర్హులుకు అన్యాయం చేస్తూ, ధనవంతులకి కొమ్ముకాస్తున్నారని ఆయన అన్నారు. పాత సొసైటి ఆఫీసు ప్రక్కన సుమారు 20 ఇళ్ళ పట్టాలు బినామీల పేరుమీద చేయించుకొన్నారని వాటిని దీనిపై విచారణ జరిపి పేద ప్రజలకు ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా వున్న ప్లాట్‌లను లక్షల్లో అమ్ముకొంటున్నా పట్టించుకొనే నాధులు కరువయ్యారని ఆయన ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ అంగన్‌వాడీ సెంటర్ కావాలని ప్రజలందరూ కోరుకొంటున్నారని వెంటనే ఇందిరమ్మ కాలనీలో అంగన్వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలని ఖదీర్ కోరారు. ఎంపిడిఓ వెంకటేశ్వర్ లు మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులపై తగిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అంతేకాక పై అధికారులకు ఫిర్యాధు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సీతమ్మ, సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి, రవనక్, కార్యదర్శులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలుకు చేరుకున్న ప్రజాస్వామ్య పరిరక్షణ సైకిల్‌యాత్ర

**బద్వేలు, అక్టోబర్ 19 ప్రభాతవార్త :**



ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం బద్వేలుకు చేరుకుంది. అనంతపురం నుంచి అమరావతి వరకు చేపట్టిన ఈ సైకిల్ యాత్రలో భాగంగా బద్వేలుకు చేరుకున్న నేపథ్యంలో బద్వేలు టీడీపీ యువనేత రితేష్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజును యువనేత రితేష్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రితేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎం.ఎస్. రాజు చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమంగా కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. ఎలాంటి మచ్చలేకుండా నిర్దోషిగా చంద్రబాబు బయటకు వస్తారనే నమ్మకం మాకు ఉందన్నారు. ఎన్నో సంవత్సరాలు రాష్ట్ర ప్రజలకోసం పాటు పడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చిన ఘనత చంద్రబాబుది అని అలాంటి నాయకుడిని హింసించడం తగదన్నారు. ఎం.ఎస్.రాజు సైకిల్ యాత్ర విజయవంతం కావాలని కోరుతున్నామన్నారు. ఎం.ఎస్.రాజుకు బద్వేలు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

## సచివాలయాన్ని ఆకస్మిక తనికీ చేసిన ఈఓపిఆర్‌డి

**గోపవరం,అక్టోబర్ 19 ప్రభాతవార్త;**



మండలంలోని చిన్న గోపవరం శివార్లలో ఉన్న సచివాలయాన్ని ఈఓపిఆర్‌డి షేక్ హసీనా ఆకశ్మికంగా తనికీ చేసారు.గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పధకాలను ప్రజలకు అందించేందుకు ప్రతి అధికారి అకుంఠిత దీక్షతో పని చేయాలన్నారు.ప్రస్తుతం ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.ఆరోగ్య కార్డులను డౌన్‌లోడు చేసే విషయం పై ఆరాతీసారు.సచివాలయ సిబ్బంది పనితీరు పట్లా సంతోషాన్ని వ్యక్తం చేసారు.కార్యక్రమంలోకార్యదర్శి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం

**– ఎమ్మెల్యే చింతల**



**కలికిరి, అక్టోబరు 19, ప్రభాతవార్త:**

ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం కలికిరి పంచాయతీలోని కలికిరి-2 సచివాలయం పరిధిలోని టెలిఫోన్ ఎక్చేంజ్ వీధి, నూరు కాలనీ, ఎస్టీ కాలనీ, వెంకటేశ్వరపురం, పీలేరు రోడ్డు మార్గాల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి వైకాపా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండలం ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్, కలికిరి మండలం జడ్పీటీసీ పద్మజా లోకవర్ధన్, కలికిరి మండలం వైసీపీ కన్వీనర్ చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, కలికిరి పంచాయతీ వార్డు మెంబర్ వేంపల్లె ఖాదర్‌బాషా, జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి వి.హరి, కలికిరి మండలం వైసీపీ బీసీ నాయకులు ఈశ్వర్‌గౌడ్, కలికిరి మండలం వైసీపీ మైనార్టీ నాయకుడు ఎస్.హనీఫ్, కలికిరి ఎంపీటీసీ బోగేష్ కలికిరి మండలం సచివాలయం కన్వీనర్ రెడ్డప్ప, కలికిరి మండలం వైసీపీ మైనార్టీ అధ్యక్షుడు నూరు మహమ్మద్, ఎంపీడీవో గంగయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీవో సుజాత, కలికిరి పంచాయతీ ఈవో ఉదయ్‌కుమార్, హౌసింగ్ ఇన్‌ఛార్జి వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చక్రపాణి, పంచాయతీరాజ్ ఏఈ అబీద్, సచివాలయం-2 కార్యదర్శి విజయేంద్ర,వెల్ఫేర్‌అసిస్టెంట్ చిన్నయ్య పాల్గొన్నారు.

## బాగ్యనగర్ కాలనీలో బాబుతో నేను కార్యక్రమం

**జమ్మలమడుగు, అక్టోబరు 19, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో బాబుతో నేను,భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొని ప్రజలకు వైకాపా ప్రభుత్వ అరాచకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయన ప్రవేశపెట్టి మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, బాల పుల్లారెడ్డి, అన్వర్ బాషా, నజీర్, దస్తగిరి, గౌస్ మోదీన్, గైబు, షేక్షావలి, మురళీ, మునేసులు, సంజీవ, చిన్న, నవీన్ రాయల్, జాకీర్, శ్రీనివాసులరెడ్డి, శంకర్, మునిస్వామి, పిలిప్; పుల్లన్న, రాజజారెడ్డి, మహేంద్ర, మస్తాన్ వల్లీ, తెదేపా నాయకులు, కార్యకర్తలు దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యకర సమాజం



**రాయచోటి, అక్టోబరు 19, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్ అన్నారు. గురువారం రాయచోటి రూరల్ చెన్నముక్కపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్ద ఎత్తున్న జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాలు జరుగుతున్నాయన్నారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి కంటి వెలుగు కార్యక్రమం కింద జిల్లా కలెక్టర్, ఏపీఐపీసీ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్, సర్పంచ్‌లు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, డీఎంహెచ్‌వో డా.కె.కొండయ్య, ఎంపీడీవో మల్‌రెడ్డి, వైద్యాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## పురుగు మందుల దుకాణాలు తనిఖీ

**దువ్వూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన దువ్వూరులోని పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. దువ్వూరులోని 2, 3 దుకాణాలు పరిశీలించి నాణ్యత గల పీసీ సర్టిఫికెట్లు గల మందులు విక్రయిస్తున్నారా లేదా వాటి తయారీ, ముగింపు తేదీలను పరిశీలించారు. నాణ్యత గల మందులనే విక్రయించాలని లైసెన్సులోని మందులే దుకాణాల్లో ఉండాలని పేర్కొన్నారు. ఏవైనా బయో కానీ, ఇతర మందులు కానీ విక్రయిస్తే వ్యవసాయ శాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. పలు రకాల శ్యాంపిల్స్ వాటిని విశాఖపట్నం ల్యాబ్‌కు పంపుతున్నామని అక్కడ వాటి నాణ్యతా ప్రమానాలుపరిశీలించి నివేదికలు అందజేస్తారని పేర్కొన్నారు. మందుల దుకాణాలు రైతులకు విక్రయిస్తే సమయంలో బిల్లులు తప్పక ఇవ్వాలన్నారు.

## శ్రీ కాళంగమర్ధిని అలంకరణలో అమ్మవారు

**ఆలయంలో వైభవంగా మహిళలు పూజలు**

**మదనపల్లె, అక్టోబర్ 19 ప్రభాతవార్త :**



పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు శ్రీ కాళంగమర్ధిని అలంకరణలో పూజలు అందుకొన్నారు. దశరా మహోత్సవాల సందర్భంగా ఐదురోజులుగా జరుగుతున్న అమ్మవారి వారోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు దేవతాసతీష్, కోశాధికారి గిరిధర్, ఉపాధ్యక్షులు నవీన్, క్రిష్ణమూర్తి, ప్రవీణ్‌కుమార్‌లుప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయదారులుగా వాసవీక్లబ్ సభ్యులు వ్యవహరించారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా పూజలు జరిగాయి. అదే విధంగా నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## బలిజ, కాపులందరు వైకాపా వైపు ఉన్నారడంలో వాస్తవం లేదు

**– టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర**

**వేంపల్లె, అక్టోబరు 19, ప్రభాతవార్త :**



బలిజ, కాపులందరూ వైకాపా వైపు ఉన్నారనడంలో వాస్తవం లేదని టీడీపీ వేంపల్లె మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గంగమ్మతల్లి దేవర గురించి మాట్లాడారు. ఆంజనేయస్వామి ఆలయం నుండి అమ్మవారిని ఊరేగింపుగా వస్తారు. ఈ విషయమై రవీంద్రనాథరెడ్డి అక్కడ ఉన్న అడ్డుకట్టను చూసి అడ్డుకట్ట ఉండడం తప్పు, దీనినివెంటనే తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై బలిజ సోదరులందరు స్పందించారని తెలిపారు. అలాగే వైఎస్ కుటుంబంతోనే బలిజలకు మేలు జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా వైఎస్ కుటుంబానికి బలిజలపై ప్రేమ ఉంటే వేంపల్లెలో బలిజ కమ్యూనిటీ కల్యాణ మండపం ఏర్పాటు చేసేలా డిమాండ్ చేయాలని ఆయన కోరారు. అలాగే టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిపై బురదచల్లే రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన సూచించారు.

## చిట్వేలిలో దసరా శోభ

**అమ్మవార్లకు ప్రత్యేక పూజలు**

**చిట్వేలి, అక్టోబరు 19 ప్రభాతవార్త**

శరన్నవరాత్రి దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజున చిట్వేలి గ్రామ పరిధిలోని పలు ఆలయాల్లో పెద్దలు, అర్చకులు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాలలో శ్రీవాసవిమాత మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి తులాభారం నిర్వహించి పెద్దఎత్తున భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ వీరభద్ర సమేత శ్రీభద్రకాళి అమ్మవారు శ్రీ రాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు అభయం ఇచ్చారు. శ్రీ సోమేశ్వరస్వామి సమేత శ్యామలాంబ అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించారు. మండలవ్యాప్తంగా దసరా శోభ ఉట్టి పడింది. పెద్దఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## శాకాంబరి అవతారంలో దుర్గామాత

**గాలివీడు, అక్టోబర్ 19(ప్రభాతవార్త):**



మండలంలోని గుండ్లచెరువు పంచాయతీ పసుపులవాండ్లపల్లె సమీపంలో వెలసిన దుర్గామాత గురువారం శాకాంబరీ అవతారంలో ప్రజలకు దర్శనమిచ్చింది. దసరా ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి అమ్మవారు వివిధ అవతారాలలో రూపాలలో పూజలను అందుకుంటున్నారు. అమ్మవారి ఉదయం పూట అభిషేకం, సాయంత్రం తీర్థప్రసాదాలు మారతులు వంటి కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు ప్రమోద్‌స్వామి ఏర్పాటు చేస్తున్నారు.

## 274 కోట్ల పొదుపు నిధులు సద్వినియోగం చేయండి

**– డీపీఎం ప్రసాద్‌రెడ్డి**

**తంబళ్లపల్లె, అక్టోబరు 19, ప్రభాతవార్త:**



అన్నమయ్య జిలల్లాలోని 29921 మహిళా సంఘాలకు చెందిన రూ.274కోట్లు పొదుపు సొమ్మును మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన తంబళ్లపల్లె ఐకేపీ కార్యాలయంలో ఏపీఎంలు గంగాధర్, కిరణ్‌కుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ మహిళా సంఘాల వద్దగల పొదుపు సొమ్ము ఖర్చు చేసుకునేలా బ్యాంకర్లతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్తులో పొదుపు సొమ్ముతో కలిపి బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రూ.38.93 కోట్లు పొదుపు సొమ్ము మహిళా సంఘాలకు డ్రా చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 3438 సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.351.45 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. దీంతో పాటు శ్రీనిధితో పాటు ముద్ర రుణాలు, వ్యక్తిగత రుణాలు పంపిణీకి బ్యాంకర్లతో సంప్రదించి అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని రుణాలు తిరిగి చెల్లించి ఐకేపీ పటిష్టతకు సహకరించాలని సూచించారు. వారి వెంట సీసీలు భవాని శంకర్, ఆదిలక్ష్మి, బద్రీ, అంశిరా బేగం, సంఘమిత్రలు, వీవో సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులందరూ జగనన్న చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్**



**రాయచోటి, అక్టోబరు 19, ప్రభాతవార్త:**

జగనన్న చేదోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్ పేర్కొన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి జగనన్న చేదోడు పథకం 4వ ఏడాది లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్, జేసీ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, సహాయ వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి కృష్ణయ్య, వివిధ శాఖల అధికారులు, టైలర్లు రజకులు, నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న వెనకబడిన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి షాపులున్న రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతోందని ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జగనన్న చేదోడు పథకానికి సంబంధించి వరుగా ఇవ ఏడాది జిల్లాలోని 12641 మందికి 126410000 రూపాయల సంబంధించిన మెగా చెక్కును జిల్లా కలెక్టర్, జేసీ చేతుల మీదుగా టైలర్లు, రజకులకు, నాయీ బ్రాహ్మణులు లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

## బిల్వవృక్ష విహారిణిగా దుర్గా మాతాజీ

**రామాపురం, అక్టోబరు 19, ప్రభాతవార్త:**



శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీసద్గురు దుర్గా మాతాజీ ఉత్సవాలు మండలంలోని నీలకంఠారావుపేట సమీపంలో ఉన్న శ్రీదర్బా సాయినగర్‌లో కొలువైన శ్రీసద్గురు దుర్గా మాతాజీ బిల్వ వృక్ష విహారిణిగా అలంకారంలోనూ, నీలకంఠరావుపేట శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మోహినీ అలంకారంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. బెంగళూరుకు చెందిన వేద పండితులతో ఉదయం నుంచి మహా గణపతి పూజలు, గంగపూజ, నవగ్రహ పూజ, కలశస్థాపన, అభిషేక పూజలు, జపాలు, హోమాలు, తీర్థ ప్రసాదాలు, మహా మంగళహారతి భక్తులకు అందించారు. రాత్రికి శ్రీచక్ర పూజ, కుంకుమార్చనలు చేశారు. పలు ప్రాంతాల నుంచి దర్బార్ సాయి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## గంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.4,21,909

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 19, ప్రభాతవార్త:**



అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి హుండీ ఆదాయం గురువారం దేవాలయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేశారు. ఈ సందర్భంగా నాలుగు నెలలకు రూ.4,21,909 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రవీంద్రరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ సామాల నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, సుబ్బయ్య, ఈశ్వరమ్మ, వెంకటేష్, ఆలయ సిబ్బంది మార్కండేయ మధుసూదన్‌రెడ్డి, ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రమౌళీ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రతి సమస్య.. నా సమస్యగా భావిస్తా

**– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి**

**పులివెందుల, అక్టోబరు 19, ప్రభాతవార్త :**



ప్రజల ప్రతి సమస్యను నా సమస్యగా భావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. పులివెందులలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ముఖ్యంగా ఈ ప్రాంత వాసులు భూ సంస్థలు, యువకులు ఉద్యోగ, విద్య అవకాశాలు కల్పించాలని, పలువురు అనారోగ్య సమస్యల గురించి ఎంపీకి వినతులు సమర్పించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడి పరిష్కరింపచేశారు.

## సుండుపల్లి మండలంలో యల్లటూరు శ్రీనివాసరాజు సుడిగాలి పర్యటన



**సుండుపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త:**

మండలంలోని అనేక గ్రామాలలో డిఆర్‌డిఏ మాజీ అధికారి రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శ్రీనివాస రాజు గారు సుడిగాలి పర్యటన చేపట్టి తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలను కలుసుకొని పార్టీ భవిష్యత్తుపై వివరించారు. తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తాతినేని శివకుమార్ స్వగృహానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. అలాగే రెడ్డెం పల్లెలోని సీనియర్ టిడిపి నాయకుడు భూశెట్టి నాగసుబ్బయ్య ను కలిసి శాలవతో సన్మానించారు. అనంతరం పెదినేని కాలువ నాగారపమ్మ ఆలయం వద్ద జనసేన పార్టీ నాయకుడు ఈశ్వర్ ఏర్పాటుచేసిన విందుకు హాజరయ్యారు. రాయవరం, మడితాడు, కొత్తపల్లి, బోనం వారి పల్లి, దేవాండ్లపల్లి సుండుపల్లెలోని పెద్ద మాదిగ పల్లి గ్రామాలలో పర్యటించి గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో పలు సమస్యలపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు జనసేన పార్టీ తరపున పోటీ చేస్తానని ఆశీర్వదించాలని గ్రామాల్లోని ప్రజలకు అన్ని విధాలుగా సహాయ పడతానని ఆయన పేర్కొన్నారు జనసేన పార్టీ తరపున పోటీ చేసేందుకు కోసం ఆయన సిద్ధంగా ఉండడంతో తోపాటు జన సైనికులతో కలిసి సుడిగాలి పర్యటన చేపట్టడంతో పార్టీ నాయకులు కార్యకర్తలు నూతన ఉత్సాహం ఏర్పడింది ఈ కార్యక్రమంలో రాజంపేట జనసేన పార్టీ నాయకులు శింగంశెట్టి నరేంద్ర, ఆకుల చలపతి, నాసిర్ ఖాన్, చల్లా మధు, పత్తి నారాయణ, సుండుపల్లి సీనియర్ నాయకుడు మచ్చా లక్ష్మీనారాయణ ,వంటేరు రాజా, సలీం ,మున్నా, భార్గవ్, శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు





**బద్వేలు అర్బన్, అక్టోబర్ 19 ప్రభాతవార్త :**

పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటి ధర్మకర్త ప్రొద్దుటూరు కిశోర్‌కుమార్ , అధ్యక్షులు దేవతి సురేంద్ర,సెక్రటరీ ఇమ్మడిశెట్టి సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీలు చిప్పగిరి ఆంజనేయులు, దేవతి సుధాకర్, ట్రెజరర్ దేవతి మల్లికార్జున,వైస్ ప్రెసిడెంట్లు ఓబుళశెట్టి చిన్న సుబ్బరాయుడు, తిరువీధి లక్ష్మణరావు, వడ్లపూటి నాగభూషణం, యువజనసంఘం అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సాయి కార్తీక్, గౌరవాధ్యక్షులు పత్తి సాయి పవన్, అడ్వయిజర్ మిట్టా సాయికుమార్, కొప్పరపు తరుణ్, ట్రెజరర్ ఒరుగంటి సాహస్ మిత్ర తో పాటు పలువురు కమిటి సభ్యులు వేదపండితులు ఒరుగంటి సీతారామశాస్త్రి, ప్రసాద్(అప్పి) తో పాటు పలువురి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, సహస్రనామార్చనతో పాటు పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి సరస్వతిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలుగా జూటూరు నాగరాజ, వీరి ధర్మపత్ని శైలజారాణి, వీరి కుమారుడు వంశీ కృష్ణ వీరి ధర్నపత్ని దీక్ష, కుమారులు చిన్మయనంద, నాగశైలేష్, రుద్రాన్స్ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటి సభ్యులు స్వామివారి సన్నిధిలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో సరస్వతి దేవి అలంకారం

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 19 ప్రభాతవార్త :**



పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో గురువారం దసరా ఉత్సవాలను ఆలయ కమిటి అధ్యక్షులు పేర్ల జనార్ధన్, సెక్రటరీ గుబ్బా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ బచ్చునాగేశ్వరరావు,ట్రెజరర్ కొండపల్లి సాయి కుమార్, ఉపాధ్యక్షులు తులసి సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షులు కొండపల్లి సుబ్బారావు, సలహదారులు నూకల రెడ్డెయ్యతో పాటు వివిధ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయంలో సరస్వతి దేవి అలంకారం నిర్వహించారు. ప్రత్యే ఉభయదాతలుగా కొప్పరపు శివయ్య, సతీమణి అంజనీదేవి కుమారుడు గురు అంకిత్, కుమార్తె గురు అఖిల కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు మదళ్లపల్లె సత్యం, సగళా నాగరాజ, బ్రహ్మదండు వెంకటసుబ్బయ్య, యలకంటి సుబ్బరాయుడు, సతీష్, వల్లంకొండు సత్యనారాయణ,చాటకొండు సుబ్బారావు,పబ్బతి సత్యనారాయణ, కొలిశెట్టి శివప్రసాద్‌రావు పలువురు పాల్గొన్నారు..

## శ్రీ విద్యా లక్ష్మిదేవి అలంకారంలో మహాలక్ష్మిదేవి

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 19 ప్రభాతవార్త :**

దసరా ఉత్సవాలలో భాగంగా శ్రీ మహాలక్ష్మిదేవి ఆలయంలో గురువారం ఆలయకమిటి అధ్యక్షులు పివిఎన్. ప్రసాద్, సెక్రటరీ కొలిశెట్టి రమేష్, ట్రెజరర్ చీదళ్ల వెంకటసుబ్బయ్యలతో పాటు పలువురు కమిటి సభ్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం శ్రీ విద్యా లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేక ఉభయదాతలుగా బచ్చు వెంకటసుబ్బారావు మరియు వారి కుమారులకు అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి శాలువా, పూలమాలలతో సత్కరించి వేదపండితుల మంత్రోచ్చారణతో ఆశీర్వదించారు. అనంతరం భక్తులకు ప్రత్యేక ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, పబ్బతి హజరత్, చిందుకూరి సుధాకర్, పబ్బతి సత్యనారాయణ, మెంటా ప్రసాద్, సురేష్, పబ్బతి చక్రపాణిలతో పాటు పలువురు కమిటి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**గోపవరం,అక్టోబర్ 19 ప్రభాతవార్త;**



మండలంలోని నెల్లూరు బద్వేలు ప్రధాన రహదారిలో వెలశిన మహిమాణ్విత శ్రీ సిద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో గురువారం భక్తి శ్రద్దలతో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. దశరా ఉత్సవాలలో బాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు.సోమేసుల రాగసుదా, సిద్వేశ్వరప్రసాద్‌ల అద్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది,ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్దప్రసాదాలను అందచేసారు.భక్తులకు కొంగు బంగారం అయిన ఈ తల్లిని దరి ్శంచుకొన్నంత మాత్రానే ్న ఎన్నో విదాలైన కష్టాలు తొలగిపోతున్నాయి.ప్రతి రోజు అధిక సంఖ్యలో ఈ తల్లిని భక్తులు దర్శించుకోని తరీస్తూంటారు.భక్తులకు అవసరమైన వసతులను ఆలయ నిర్మాణ దాత సిద్దేశ్వర ప్రసాద్ ఏర్పాటు చేస్తూ ఉంటారు.ఈ దసరా ఉత్సవాలలో అదిక సంఖ్యలో భక్తులు పాల్గొని సిద్దమ్మతల్లి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## అన్నపూర్ణేశ్వరీ అలంకారంలో కన్యకాపరమేశ్వరి

**చిన్నమండెం, అక్టోబర్ 19(ప్రభాతవార్త):**



మండల కేంద్రంలోని ఆర్యవైశ్య బజారులో వెలసిన కన్యకా పరమేశ్వరీ ఆలయం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అన్నపూర్ణేశ్వరిదేవి అలంకారం చేశారు. అభిషేకం మరియు సాయంకాలం అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు, భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

## రెండు ఆటోలు సీజ్ – డ్రైవర్లు అరెస్ట్

**రామాపురం, అక్టోబరు 19, ప్రభాతవార్త:**



కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం దర్గా రోడ్డు సమీపంలో ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అధిక లోడుతో వెళ్తున్న రెండు ఆటోలను సీజ్ చేసి ఆటో డ్రైవరన్లను అరెస్టు చేసినట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు జాతీయ రహదారిపై అధిక లోడుతో వెళ్లరాదని అలాగే ఆటో డ్రైవర్లు అధిక జనాన్ని ఎక్కించుకొని వెళ్తే లైసెన్సులతో పాటు ఆర్సీ రికార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్‌శర్మ, హెడ్‌కానిస్టేబుల్ రఫీ, పోలీసు సిబ్బంది హరిప్రసాద్, శివప్రసాద్, అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.